సాక్షి వికారాబాద్

శుక్రవారం ı 26 ı సెప్టెంబర్ ı 2025



మండల పీఠం దక్కేనా!

బొంరాస్‌పేట్ మండలం ఏర్పడిన నాటినుంచి ఎస్సీలకు మండల పీఠం దక్కకపోవడంపై ఆ వర్గాల్లో ఆందోళన కలిగిస్తోంది. 10లో ▸



అర్ధరాత్రి అక్రమంగా..

బషీరాబాద్ మండలంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. అర్ధరాత్రి కాగ్నా నది నుంచి తరలిస్తున్నారు. 10లో ▸



ఇంటి ఫొటోతో బిల్లు

ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు ఆలస్యం కారాదనే ఉద్దేశంతో ప్రభుత్వం కొత్త యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. 11లో ▸

న్యూస్‌రీల్

రేపు చలో కలెక్టరేట్



రైతులతో మాట్లాడుతున్న మైపాల్

అనంతగిరి: జిల్లాలోని ట్రిపుల్‌ఆర్ భూ నిర్వాసితులతో రేపు చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ తెలిపారు. గురువారం నాలుగు మండలాల భూ బాధితులతో ఆయన మాట్లాడారు. రైతుల నుంచి బలవంతంగా భూములు లాక్కోవద్దని సూచించారు. కొత్త అలైన్‌మెంట్‌తో పేద, మధ్య తరగతి రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. పాత అలైన్‌మెంట్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు కృష్ణారెడ్డి, సురేందర్, శ్రీను, నర్సింలు, బాలరాజు, రాంచంద్రయ్య జంగయ్య, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ గృహకల్పలో కార్డన్ సెర్చ్



దుకాణ యజమానితో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని రాజీవ్ గృహకల్పలో గురువారం రాత్రి పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఇద్దరు సీఐలు, 9మంది ఎస్‌ఐలు, 6గురు ఏఎస్‌ఐలు, 45మంది సిబ్బంది పాల్గొన్నారు. ముందుగా కాలనీలోని అన్ని నివాసాల వద్ద తనిఖీలు చేపట్టారు. అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లలో తనిఖీలు చేపట్టారు. నంబర్ ప్లేట్లు, సరైన ధ్రువపత్రాలు లేని 41 ద్విచక్ర వాహనాలు, 2ఆటోలు, మరో ఫోర్ వీలర్‌ను సీజ్ చేశారు. కార్యక్రమంలో వికారాబాద్ టౌన్ సీఐ భీంకుమార్, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆ యాక్ట్‌ను తక్షణం అమలు చేయాలి

అనంతగిరి: అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తక్షణం అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అడ్వకేట్ బీఆర్ కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తెలంగాణ జూనియర్ అడ్వకేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద చేపట్టిన దీక్షలో పాల్గొన్నట్లు తెలిపారు.

కొత్త మద్యం దుకాణాలకు టెండర్లు షురూ..

- జిల్లాలో మొత్తం షాపులు 59
- రిజర్వ్‌డ్ చేసినవి 17
- లాటరీ ద్వారా ఎస్సీలకు 9, ఎస్టీలకు 2, గౌడలకు 6కేటాయింపు
- నేటి నుంచి అక్టోబర్ 18 వరకు దరఖాస్తుల స్వీకరణ
- వచ్చే నెల 23న లాటరీ పద్ధతిన షాపుల కేటాయింపు

అనంతగిరి: జిల్లాలో నూతన మద్యం పాలసీ 2025– 27 సంవత్సరానికి గాను 59 షాపులకు టెండర్లు నిర్వహించనున్నట్లు కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. లాటరీ పద్ధతి ద్వారా 17 దుకాణాలను వివిధ కేటగిరీలకు కేటాయించినట్లు తెలిపారు. గురువారం వికారాబాద్ కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఆబ్కారి శాఖ ఆధ్వర్యంలో నూతన మద్యం దుకాణాల కేటాయింపుపై సమావేశం నిర్వహించారు. ఎస్సీ కేటగిరికి 9, ఎస్టీలకు 2, గౌడ కులస్థులకు 6 కేటాయించం జరిగిందని తెలిపారు. మిగిలిన 42 దుకాణాలకు ఓపెన్ కేటగిరి కిందకు వస్తాయన్నారు. ఆసక్తి గల వారు రూ.3.3 లక్షలు (నాన్ రీఫండబుల్)డీడీ తీసి దరఖాస్తు చేయవచ్చని తెలిపారు. ఈ నెల 26 నుంచి అక్టోబర్ 18వ తేదీ వరకు అప్లికేషన్లు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. అక్టోబర్ 23న కలెక్టరేట్‌లో లాటరీ తీయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, జిల్లా ఆబ్కారీ అధికారి విజయ భాస్కర్, డీటీడీఓ కమలాకర్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి మాధవరెడ్డి పాల్గొన్నారు.



రిజర్వ్‌డ్ దుకాణాలకు లాటరీ తీస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

పెద్దేముల్ అటవీ ప్రాంతంలో మొక్కలు నాటుతున్న కూలీలు



9 శాఖలు | 0 మొక్కలు

- వనమహోత్సవంలో ఒక్క మొక్కా నాటని ఆయా విభాగాలు
- టార్గెట్ ఇచ్చినా నిర్లక్ష్యంగానే..
- గడువు మరో పక్షం రోజులే..
- ఈ ఏడాది లక్ష్యం 48,38,400 మొక్కలు
- ఇప్పటి వరకు నాటింది 35,82,283

తాండూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవ కార్యక్రమాన్ని కొన్ని శాఖలలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. జిల్లాలోని అన్ని ప్రభుత్వ విభాగాలకు టార్గెట్ ఇచ్చారు. కానీ తొమ్మిది శాఖల ఉద్యోగులు ఒక్క మొక్క కూడా నాటకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. వానాకాలం సీజన్ ప్రారంభ దశలో ఆశించిన స్థాయిలో వర్షాలు పడలేదు. జూలై నెలలో సమృద్ధిగా కురవడంతో మొక్కలు నాటే ప్రక్రియను ప్రారంభించారు.

లక్ష్య ఛేదనలో..

ఈ ఏడాది జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలు, 20 మండలాల్లో 48.38 లక్షల మొక్కలు నాటేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంది. 20 ప్రభుత్వ శాఖలు, నాలుగు మున్సిపాలిటీలకు టార్గెట్ కేటాయించారు. ఇప్పటి వరకు ఆయా శాఖలు 35,82,223 మొక్కలు నాటాయి. తొమ్మిది విభాగాలు మాత్రం ఒక్క మొక్క కూడా నాటలేదు. మరో పక్షం రోజులు మాత్రమే గడువు ఉండటంతో టార్గెట్ పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. డీఆర్‌డీఓ అధికారులు లక్ష్యానికి మించి మొక్కలు నాటారు. అటవీ శాఖ గమ్యానికి చేరువైంది.

ఆ జాబితాలో..

మొక్కలు నాటని జాబితాలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, నీటి పారుదల, వ్యవసాయ, మార్కెటింగ్, పోలీసు, పశు సంవర్ధక, గనులు, సంక్షేమ శాఖలు ఉన్నాయి. ఈ విభాగాలకు టార్గెట్ కేటాయించినా ఆ దిశగా ముందుకు సాగలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యం

శాఖ	టార్గెట్	నాటిన మొక్కలు
అటవీ	3,60,000	2,70,774
వ్యవసాయ	6,38,500	0
పశు సంవర్ధక	5,000	0
ఆర్‌అండ్‌బి	500	0
డీఆర్‌డీఓ	26,87,000	30,87,000
ఉద్యాన	2,55,400	2,55,400
పౌరసరఫరాల	2,000	2,000
విద్య	11,000	11,000
మార్కెటింగ్	500	0
పంచాయతీరాజ్	4,00,000	0
పరిశ్రమల	10,000	10,000
గనుల	58,000	0
ఎక్సైజ్	58,900	33,955
డీడబ్ల్యూఓ	1,000	0
పోలీను	9,200	0
నీటి పారుదల	7,600	0
మున్సిపాలిటీ		
తాండూరు	3,50,000	3,90,000
వికారాబాద్	1,10,500	1,42,500
కొడంగల్	3,25,000	3,25,500
పరిగి	83,550	63,854

కచ్చితమైన ఆదేశాలున్నాయి



జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖలకు మొక్కల లక్ష్యాలను కేటాయించారు. టార్గెట్ పూర్తి చేయాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ కచ్చితమైన ఆదేశాలు జారీ చేశారు. ఇందులో ఏ శాఖకు మినహాయింపు లేదు. గ్రామీణాభివృద్ధి శాఖ లక్ష్యానికి మించి మొక్కలు నాటింది. అటవీ శాఖ వంద హెక్టార్ల అటవీ భూముల్లో మొక్కలు నాటి గమ్యానికి చేరువలో ఉంది.

– జ్ఞానేశ్వర్, డీఎఫ్ఓ

బతుకమ్మ కానుకలు సిద్ధం

జిల్లాకు చేరిన చీరలు

- పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్న అధికార యంత్రాంగం
- అవసరమైన చీరలు 2,73,000
- ఇండెంట్ పెట్టింది 1,93,065
- ఇప్పటి వరకు వచ్చింది 63వేలు
- ఇంకా రావాల్సినవి 1,30,065

వికారాబాద్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ కానుకలు జిల్లాకు చేరాయి. రాష్ట్ర పండుగ కావడంతో ప్రభుత్వం మహిళా సంఘాల సభ్యులకు చీరలు పంపిణీ చేయనుంది. బీఆర్‌ఎస్ హయాంలో మహిళలందరికీ పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక గత ఏడాది కానుకలు పంపిణీ చేయలేదు. ఈ ఏడాది కాస్త ముందుగానే గోదాంలకు చేరాయి. వాటిని పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉండటంతో త్వరగా పంపిణీ చేయాలని భావిస్తున్నారు. శనివారం లేదా ఆదివారం నుంచి మొదలు పెట్టనున్నారు. తెలంగాణ హస్తకళాకారుల చేతిలో రంగులు దిద్దుకున్న బతుకమ్మ చీరలు ఇప్పటికే అన్ని నియోజకవర్గ కేంద్రాలకు చేరాయి. వాటిని ఆయా మండల కేంద్రాలు, గ్రామాలకు చేరవేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ప్రత్యేక బృందాల ద్వారా వీటిని పంపిణీ చేయనున్నారు. రేషన్ డీలర్లు, ఐకేపీ, మెప్మా అధికారులు ప్రక్రియలో కీలకంగా వ్యవహరించనున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కానుకలు అందజేస్తారు.

ఈ సారి సగం మందికేనా?

జిల్లాలో 3,54,912 మంది మహిళలు ఉండగా ప్రభుత్వం ఈ సారి మహిళా సంఘాల సభ్యులకు మాత్రమే పంపిణీ చేయనుంది. వీరిలో చాలా మంది చీరలు తీసుకునేందుకు ఆసక్తి చూపక పోవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలో 2,73,000 చీరలు సరిపోతాయని తేల్చారు. ఈ సంఖ్యను మరింత తగ్గించి 1,93,065 ఇండెంట్ పెట్టారు. ఇందులో వికారాబాద్ నియోజకవర్గంలో 59,443మందికి, పరిగిలో 48,028మందికి, తాండూరులో 56,198 మందికి, కొడంగల్‌లో 29,396మందికి పంపిణీ చేయాలని నిర్ణయించారు. ప్రస్తుతం 63 వేల చీరలు ఆయా నియోజకవర్గ కేంద్రాల్లోని గోదాంలకు చేరాయి. మరో 1,30,065 రావాల్సి ఉందని అధికారులు తెలిపారు.

తాండూరు, పరిగి నుంచి..

జిల్లాకు చేరిన చీరలను పరిగి ఇండోర్ స్టేడియం, తాండూరు సమీపంలోని ఖాంజాపూర్ వ్యవసాయ మార్కెట్ గోదాంలో ఉంచారు. పరిగి నుంచి బొంరాస్‌పేట్, పరిగి మున్సిపాలిటీకి తరలించనున్నారు. ఖాంజాపూర్ నుంచి తాండూరు, కొడంగల్‌తో పాటు మరో నాలుగు మండలాలకు చేరవేస్తున్నారు. ఈ సారి స్వయం సహాయక సంఘాల్లో పేర్లున్న వారికే పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

అన్ని ఏర్పాట్లు చేశాం



జిల్లాలో రెండు మూడు రోజుల్లో బతుకమ్మ చీరలు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తాం. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు చేశాం. ఎంపీడీఓలు, తహ సీల్దార్లకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించాం.ఇంకా 50శాతం చీరలు రావాల్సి ఉంది. వచ్చిన వాటిని మండలాలకు అక్కడి నుంచి గ్రామలకు చేరవేస్తున్నాం. ఎమ్మెల్యేలు, అధికారులు చీరలను పంపిణీ చేస్తారు.

– శ్రీనివాస్, డీఆర్డీఓ

బాలాజీ సన్నిధిలో సంగీత దర్శకుడు

మొయినాబాద్: బ్లాక్ బాస్టర్ విజయం సాధించిన 'మిరాయ్' చిత్ర సంగీత దర్శకుడు గౌరహరి చిలుకూరు బాలాజీని దర్శించుకున్నాడు. గురువారం దేవాలయానికి చేరుకున్న ఆయన ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి గర్భగుడిలో స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు రంగారాజన్‌కు చిత్ర విశేషాలను తెలియజేశారు. చిత్రం యూనిట్ తరపున చిలుకూరు బాలాజీకి కృతజ్ఞతలు తెలపడానికి వచ్చినట్లు చెప్పారు.



అర్చకుడు రంగరాజన్‌తో గౌర హరి

బీజేపీలో అందరికీ సమ ప్రాధాన్యత

తాండూరు టౌన్: బీజేపీ అన్ని వర్గాల వారికి సమ ప్రాధాన్యత ఇస్తోందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి అన్నారు. ప్రధాని మోదీ జన్మదిన సేవా పక్షోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని హరిజన వాడలో జిల్లా కార్యదర్శి వెంకటేష్‌తో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని పక్షం రోజుల పాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల కన్వీనర్ బాలేశ్వర్ గుప్తా, జిల్లా ప్రధాన కార్యదర్శి పటేల్ విజయ్, ఉపాధ్యక్షులు సాయిరెడ్డి, నరేందర్ రెడ్డి, సుదర్శన్ గౌడ్, లాల య్య, విక్రాంత్, అంబదాస్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలో పార్టీ నాయకులు భారతీయ జనసంఘ్ అధ్యక్షుడు, ఆర్ఎస్ఎస్ ప్రచారక్ పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు నాగారం మల్లేశం, నాయకులు మల్లేష్, కృష్ణ, ప్రకాష్, ప్రహ్లాద్, కిరణ్, నరేష్, సంగమేశ్వర్, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



హరిజన వాడలో సహపంక్తి భోజనం చేస్తున్న బీజేపీ నాయకులు

ట్రిపుల్‌ఆర్ బాధితులకు అండగా ఉంటాం

- సమస్యను కేంద్రం దృష్టికి తీసుకెళ్తా
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

పూడూరు: ట్రిపుల్ ఆర్ భూ బాధితులకు అండగా ఉంటామని, సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం మండలంలోని రాకంచర్ల ఆలయ ప్రాంగణంలో భూములు కోల్పోతున్న పరిగి, వికారాబాద్, నవాబుపేట్, పూడూరు మండలాలకు చెందిన రైతులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి రైతుల సమస్యలు తెలియజేస్తానని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరోసారి ఆలోచించాలని కోరారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి నితిన్‌గడ్కారిని కలుస్తానని తెలిపారు. ట్రిపుల్ ఆర్ కారణంగా రైతులకు జరిగే నష్టాన్ని, రైతుల బాధలను అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డితో ఫోన్‌లో మాట్లాడినట్లు చెప్పారు. పేద రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరినట్లు తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు కారణంగా ఎక్కువగా పేదల భూములు పోతున్నాయని, పాత అలైన్‌మెంట్ అమలు చేసేలా ఒత్తిడి తెస్తామన్నారు. పార్టీలకు అతీతంగా పోరాడితేనే సమస్య పరిష్కారం అవుతుందని అన్నారు. సమస్య తీవ్రత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలిసేలా చేయాలని సూచించారు. అనంతరం బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ మాట్లాడుతూ.. పెద్దల భూములను కాపాడటం కోసం పేదల కడుపుకొడతారా అని నిలదీశారు. ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ ఎందుకు మార్చాల్సి వచ్చిందో ప్రజలకు వివరించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి పేద రైతులకు న్యాయం జరిగేలా చూడాలని ఎంపీ విశ్వేశ్వర్ రెడ్డిని కోరారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు భూనేటి కిరణ్‌కుమార్, శరత్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మల్లేశం, తాజొద్దీన్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

ప్రశ్నిస్తే అరెస్టులా?



దుద్యాల్ గేటు వద్ద నరేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి మండిపాటు
- కొడంగల్‌లో బాధితులను కలిసేందుకు వెళ్తుండగా నిర్బంధం
- పలు ఠాణాలు తిప్పి చన్గోముల్ పీఎస్‌కు తరలింపు
- భారీగా తరలివచ్చిన బీఆర్‌ఎస్ నేతలు
- పలుచోట్ల నాయకుల ముందస్తు అరెస్టులు

దుద్యాల్/దోమ/పూడూరు/పరిగి: పేదలు, బాధితుల పక్షాన నిలబడి పోరాటం చేస్తే అక్రమంగా అరెస్టులు చేస్తారా..? అని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గురువారం దోమ పోలీస్ స్టేషన్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి అక్రమ అరెస్టులతో పబ్బం గడుపుతున్నారని విమర్శించారు. కొడంగల్ పట్టణంలో అభివృద్ధి పేరిట అడ్డగోలుగా పేదల ఇళ్లు, మసీదులు, దర్గాలు, చర్చిలు కూల్చివేయడం సరికాదని హితవు పలికారు. అరాచకాలను ప్రశ్నించేందుకు వెళ్తున్న తమను అరెస్టు చేయించి రాక్షసానందం పొందుతున్నారని మండిపడ్డారు. తాము ఏనాడూ అభివృద్ధిని అడ్డుకోలేదని, బాధితులకు పూర్తి న్యాయం చేసిన తర్వాతే పనులు చేపట్టాలని కోరుతున్నట్లు వివరించారు. పేదల ఇళ్లు కూల్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు.

అసలేం జరిగిందంటే..

కోస్గి పట్టణంలో ఓ వివాహ వేడుకకు హాజరైన నరేందర్‌రెడ్డి కొడంగల్‌కు బయలుదేరారు. ఇటీవల కొడంగల్‌లో చేపట్టిన రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా అధికారులు పలు ఇళ్లు, దర్గా, శ్మశానవాటికను కూల్చివేశారు. ఈవిషయమై నాలుగు రోజుల క్రితం బాధితులు, ముస్లింలు ఆందోళన చేపట్టారు. ఈ క్రమంలో వారిని కలిసేందుకు నరేందర్‌రెడ్డి సిద్ధమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు దుద్యాల్ గేటు వద్ద ఆయన్ను అరెస్టు చేశారు. మొదట దుద్యాల్ పీఎస్‌కు తరలించాలని భావించారు. అయితే అక్కడికి బీఆర్‌ఎస్ నేతలు చేరుకోవడంతో దోమ స్టేషన్‌కు ఆ తర్వాత చన్గోముల్ పోలీస్‌స్టేషన్ తరలించారు. నరేందర్‌రెడ్డితోపాటు దౌల్తాబాద్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోట్ల మైపాల్, హస్నాబాద్ మైనార్టీ నాయకుడు ఉస్మాన్ తదితరులను పోలీసులు అరెస్టు చేశారు.



దోమ పోలీస్ స్టేషన్ వద్ద నరేందర్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేతలు

ముందస్తు అరెస్టులు

పట్నం నరేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ఎలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా పలువురు బీఆర్‌ఎస్ నేతలను ముందస్తు అరెస్టు చేశారు. మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రామకృష్ణను కొడంగల్‌లో అరెస్టు చేసి పరిగి స్టేషన్‌కు తరలించారు. వీరిని జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు మీర్ మహమూద్ అలీ, మున్సిపల్ మాజీ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్, ప్రవీణ్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ భాస్కర్, సురేందర్ తదితరులు కలిశారు. అలాగే దుద్యాల్ మండల అధ్యక్షుడు చాంద్ పాషా, నాయకులు నరేశ్ గౌడ్, బుగ్గప్ప, బసిరెడ్డి, సోమనాథ్, రాములు, విశాల్‌ను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

భారీగా చేరుకున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

నరేందర్‌రెడ్డి అరెస్టు విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్, మాజీ ఎంపీపీ మల్లేశం, పార్టీ శ్రేణులు దోమ పీఎస్‌కు చేరుకుని నరేందర్‌రెడ్డిని పరామర్శించారు. పాలన చేతగాకే అక్రమ అరెస్టులు చేయిస్తున్నారని మండిపడ్డారు.

క్లుప్తంగా

పేదలకు అండగా ఉంటా

పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి



ఎంబీబీఎస్ సీటు సాధించిన స్వప్నను అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి

కుల్కచర్ల: పేదలకు అండగా ఉంటానని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి అన్నారు. చాకల్‌పల్లి గ్రామానికి చెందిన స్వప్న పటేల్ ఎంబీబీఎస్‌లో సీటు సాధించింది. కాగా స్వప్న ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలుసుకున్న ఆయన గురువారం బాధిత కుటుంబాన్ని అండగా ఉంటానని భరోసా కల్పించారు. విద్యార్థిని చదువుకోసం సహకరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చౌడాపూర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సత్తినేని సుధాకర్ రెడ్డి, యువజన విభాగం అధ్యక్షుడు మేగ్యానాయక్, నాయకులు కొత్తబలిజ రాజు, చెన్నయ్య, రొయ్యల ఆంజనేయులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మిషనరీ కొనుగోళ్లలో అవకతవకలు

- బీఆర్ఎస్ నాయకుల ఫిర్యాదు
- పీఏసీఎస్‌లో విచారణ చేపట్టిన సీనియర్ అసిస్టెంట్

యాలాల: మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంకు సంబంధించిన రైసుమిల్లు, మిషనరీ కొనుగోళ్ల విచారణను గురువారం చేపట్టారు. దౌలాపూర్ సమీపంలోని నిర్మాణంలో ఉన్న రైసుమిల్లు, గోదాంకు సంబంధించి అవకతవకలు జరిగాయని ఇటీవల బీఆర్ఎస్ నాయకులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా కోఆపరేటివ్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కవిత విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో సొసైటీ చైర్మన్‌తో పాటు సిబ్బందిని సంబంధిత వివరాలు అడిగారు. మిషనరి కొనుగోలు కోసం పాలకవర్గం తీర్మానించి రూ.54లక్షలను అడ్వాన్సుగా కాంట్రాక్టర్‌కు చెల్లించినట్లు విచారణలో వెల్లడైంది. నేటికి మిషనరి ఏర్పాటు చేయకపోవడంతో వాటికి సంబంధించిన తీర్మానం, రికార్డుల వివరాలు మూడు రోజుల్లోగా అందజేయాలని ఈ సందర్భంగా సొసైటీ సిబ్బందికి ఆదేశించినట్లు సమాచారం.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



పోలీసులు అదుపులో నిందితుడు ఖాసీమ్ పటేల్

తాండూరు టౌన్: కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి తాండూరులో గంజాయి సరఫరా చేస్తుండగా గురువారం జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 1,100 గ్రాముల ఎండు గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. కర్నాటక రాష్ట్రం సేడంకు చెందిన ఖాసీం పటేల్ గంజాయిని తెచ్చి తాండూరులో విక్రయిస్తుంటాడు. పక్కా సమాచారం మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జి అన్వర్ పాషా తన సిబ్బందితో కలిసి నిందితుడిని పట్టుకుని, గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అతన్ని తాండూరు పట్టణ పోలీసులకు అప్పగించి, ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేశారు.

విద్యుత్ తీగల చోరీ ముఠా అరెస్ట్



విద్యుత్ తీగల చోరీ ముఠాను అదుపులోకి తీసుకున్న పోలీసులు

కడ్తాల్: పలు వెంచర్లలో విద్యుత్ తీగల చోరీకి పాల్పడుతున్న ముఠాను పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఈ మేరకు సీఐ గంగాధర్ పోలీస్ స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. మండల పరిధిలోని వివిధ వెంచర్లలో ఇటీవల దుండగులు విద్యుత్ స్తంభాల నుంచి అల్యూమినియం తీగలను రాత్రి వేళలో ఎత్తుకెళ్లారు. ఈ మేరకు యాజ మానులు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమో దు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. గురువారం హైదరాబాద్ నుంచి ఆమనగల్లు వైపు అనుమానాస్పదంగా వెళుతున్న కారులో ముఠాను పోలీసులు తనిఖీ చేశారు. వీరు ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన సత్యం చౌబే, ధీరజ్‌కుమార్, ఒడిశాకు చెందిన జనరోహన్, బిహా ర్‌కు చెందిన శ్యామ్‌బాబురామ్‌గా గుర్తించారు. జల్సాలకు అలవాటు పడిన వీరు బృందంగా ఏర్ప డి నగరంలోని జీడిమెట్ల ఉంటూ చోరీలు పాల్పడుతున్నారు. గూగుల్ లోకేషన్ ఆధారంగా కడ్తాల్ పరిధిలో విద్యుత్ తీగల చోరీలకు ప్రణాళికలు రచించా రని పోలీసులు పేర్కొన్నారు. నిందితుల నుంచి రూ.40 వేల నగదు, కారు, రెండు సెల్‌ఫోన్లు, మూ డు కట్టర్లు, స్క్రూ డ్రైవర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పరారీలో ఉన్న ధీరజ్ కుమార్ ఉన్నట్లు చెప్పారు. కేసును చాకచక్యంగా సీసీ కెమెరాలను ఉపయోగించి ఛేదించిన కానిస్టేబుల్ రాంకోటి, రాజశేఖర్‌లను అభినందించారు.

ఓవైపు వర్ణశోభితం.. మరోవైపు దుఃఖసాగరం



దసరా నవరాత్రి ఉత్సవాలు, దీపావళి, కార్తీకపౌర్ణమి పర్వదినాలను పురస్కరించుకొని ఏటా బంతి పూలకు డిమాండ్ ఉంటుంది. మండలంలోని కోస్గి రోడ్డులో రైతు భీంరెడ్డి అర ఎకర పొలంలో బంతి పూలను సాగు చేశారు. రోడ్డు పక్కనే తోట ఉండడంతో వర్ణశోభితంగా కనువిందు చేస్తోంది. మరోవైపు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలో పత్తి పంటకు తీరని నష్టం వాటిల్లింది. ర్యాలగుట్టతండాలో వరదనీటిలో మునగడంతో పత్తి పంట పూర్తిగా పాడైందని అన్నదాతలు విచారం వ్యక్తం చేస్తున్నారు. - దౌల్తాబాద్



ఈ సారైనా..!

మండల పీఠం దళితులకు దక్కేనా?

- 1987 నుంచి ఇప్పటివరకు వరించని రిజర్వేషన్
- ఏడు పర్యాయాలూ ఇతర సామాజిక వర్గాలకే కేటాయింపు
- అవకాశం కోసం ఎదురుచూస్తున్న ఆశావహులు



మండల పరిషత్ కార్యాలయం

బొంరాస్‌పేట: సమాజంలో అన్ని వర్గాలకు రాజకీయంలో ప్రాతినిధ్యం కల్పించడానికి రాజ్యాంగంలో రిజర్వేషన్లను కల్పించారు. దీంతో వెనుకబాటుకు గురైన వర్గాలు ప్రగతిపథంలోకి రావడానికి మార్గం సులువవుతుందని నాటి రాజ్యాంగ నిర్మాతలు పేర్కొన్నారు. కానీ బొంరాస్‌పేటలో సమాన అవకాశాలకు స్థానం లేకుండా పోతుందని ప్రజాసంఘాల నేతలు ఆరోపిస్తున్నారు. మండలం ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుల స్థానాల్లో షెడ్యూల్ కులాలకు(ఎస్సీ) అవకాశం దక్కక పోవడమే ఇందుకు కారణం. సీఎం రేవంత్‌రెడ్డి కొలువుదీరిన కొడంగల్ నియోజకవర్గంలో రాజకీయ వాస్తుగా భావిస్తున్న బొంరాస్‌పేటలో ఇప్పటివరకు ఎస్సీలకు ప్రాతినిధ్యం లేకపోవడంతో నాయకులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

16 వేలకు పైగా ఎస్సీల జనాభా

నిజాం పాలన అనంతరం మండల వ్యవస్థకు ముందు బ్లాకులుగా ఉండగా మండలానికి 1987 మొదటి ఎంపీపీగా నాగిరెడ్డిపల్లికి చెందిన ప్రమీలాదేవి పీఠమెక్కారు. అనంతరం 1995లో మండల, జిల్లా పరిషత్‌లు ఏర్పడి ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుల విధానం ప్రారంభమైంది. అప్పటినుంచి 2019 వరకు వచ్చిన ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుల రిజర్వేషన్లలో మండలంలో ఎస్సీలకు రిజర్వేషన్ రాకపోవడం శోచనీయం. మండలంలో మొత్తం జనాభా 40వేలకు పైగానే ఉంది. అందులో ఎస్సీలు 16 వేలకు పైనే సింహభాగాన్ని ఆక్రమించారు. కానీ ఇక్కడి దళితులు నేటికి ఓటర్లుగా, నలుగురు ఎంపీటీసీలుగా ఉన్నారే తప్పా మండల పీఠంపై కూర్చోలేదనే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రస్తుతం ఏర్పడే స్థానిక ఎన్నికల రిజర్వేషన్లలో మండలానికి ఎస్సీ రిజర్వేషన్ కల్పించాలని దళితులు, రాజకీయ నాయకులు, విద్యావంతులు కోరుతున్నారు.

ఎంపీపీ పదవి పీఠం వివరాలు

ఎన్నికలు	రిజర్వేషన్	ఎంపీపీ	వైస్ ఎంపీపీ
1987	జనరల్	ప్రమీలమ్మ	పదవి లేదు
1995	బీసీ(జనరల్)	వెంకట్రాములుగౌడ్	విష్ణువర్ధన్‌రెడ్డి
1997	అవిశ్వాసం	ప్రభులింగం	నర్సిరెడ్డి
2001	జనరల్(మహిళ)	అంజిలమ్మ	రామకృష్ణ
2006	ఎస్టీ(జనరల్)	గోబ్రియానాయక్	సుశీలమ్మ
2014	బీసీ (మహిళ)	మంగమ్మ	దేశ్యానాయక్
2019	ఎస్టీ (మహిళ)	హేమీబాయి	నారాయణరెడ్డి, సుదర్శన్ రెడ్డి, శ్రావణ్‌గౌడ్

జెడ్పీటీసీ సభ్యుల జాబితా

సంవత్సరం	రిజర్వేషన్	పదవి పొందినవారు
1995	ఎస్టీ(మహిళ)	తుల్జమ్మ
2001	బీసీ(జనరల్)	యాదగిరి
2006	జనరల్	మల్కిరెడ్డి
2014	జనరల్(మహిళ)	జ్యోతి
2019	ఎస్టీ (మహిళ)	అరుణదేశు చౌహాన్

సీఎం చొరవ చూపాలి



తాలూకా మొత్తంలోని అన్ని మండలాల్లో ఎస్సీలకు ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుల పదవులు దక్కాయి. బొంరాస్‌పేట ఎస్సీల్లో ఉన్న మాల, మాదిగ, డక్కలి, చిందు, మాస్టిన్, బైండ్ల ఉపకులాలవారు ఉన్నారు. ప్రస్తుతం మండల పీఠం దక్కేలా రిజర్వేషన్లను అధికారులు కల్పించాలి.

– కాశప్ప, మాజీ సర్పంచ్, లింగన్‌పల్లి

ప్రాధాన్యం ఇవ్వాలి



బీసీలకు 42శాతం ఇస్తున్న రిజర్వేషన్లతోపాటు మండల ఎస్సీలకు ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాల్లో అవకాశం కల్పించాలి. ఏడుసార్లలో ఎస్సీలకు రిజర్వేషన్ లేకపోవడం విచారకరం. రాజ్యాంగం ప్రకారం దళితులకు రాజకీయాల్లో సరైన ప్రాధాన్యం ఇవ్వాలి. దీనిపై సీఎం దృష్టికి తీసుకెళ్లాం.

– గుణశేఖర్, యువజన కాంగ్రెస్ నేత, కొత్తూరు

ఉత్తమ చదువు.. ఉన్నత ఉద్యోగం

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు చెందిన పలువురు అభ్యర్థులు గ్రూప్‌- 1 ఫలితాల్లో సత్తాచాటారు. వివిధ శాఖల్లో ఉద్యోగాలు సాధించి యువతకు ఆదర్శంగా నిలిచారు.

గ్రూప్ -1 ఫలితాల్లో సత్తాచాటిన ఉమ్మడి జిల్లా అభ్యర్థులు



వర్షిత



దివ్య



మోనిక



మారుతి



జయకృష్ణ

లక్ష్యం.. ఐఏఎస్

ధారూరు: మండలంలోని నాగారం గ్రామానికి చెందిన వర్షిత గ్రూప్‌-1లో సత్తాచాటి డీఎస్పీగా ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆమె యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండల వ్యవసాయ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఆమె తల్లిదండ్రులు నరేందర్‌రెడ్డి, నవనీత ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఏటా జాబ్ చేస్తూనే పోటీ పరీక్షలకు హాజరైన వర్షిత.. ఐఏఎస్ లేదా ఐపీఎస్ తన లక్ష్యమని తెలిపారు.

తొలి ప్రయత్నంలోనే..

మర్పల్లి: మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన ధనసిరి దివ్య గ్రూప్‌- 1 మొదటి ప్రయత్నంలోనే ఉత్తమ ర్యాంకు సాధించి, ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా ఎంపికయ్యారు. తమ కూతురు సాధించిన విజయంపై తల్లిదండ్రులు రాణి, ప్రకాశ్ సంతోషం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా దివ్య మాట్లాడుతూ.. తల్లిదండ్రులు, గురు వుల స్ఫూర్తితోనే ఉద్యోగం సాధించానని తెలిపారు.

కుల్కచర్ల నుంచి ఇద్దరు..

కుల్కచర్ల: గ్రూప్‌- 1 ఫలితాల్లో 263 ర్యాంకు సాధించిన కుల్కచర్లకు చెందిన మోనిక స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో జిల్లా రిజిస్ట్రార్‌గా ఎంపికయ్యారు. అదేవిధంగా తిర్మలాపూర్ గ్రామానికి చెందిన మారుతి మున్సిపల్ కమిషనర్ పోస్టుకు ఎంపికయ్యారు.

సర్కారు బడిలో చదివి..

మహేశ్వరం: మండల పరిధిలోని తుమ్మలూరు గ్రామానికి చెందిన గడ్డమీది జయకృష్ణ గ్రూప్‌- 1 ఫలితాల్లో 378 ర్యాంకు సాధించి అసిస్టెంట్ ట్రెజరీ అధికారిగా ఎంపికయ్యారు. గతంలో విడుదలైన గ్రూప్‌- 2లో 94వ ర్యాంకు, గ్రూప్‌- 3లో 175వ ర్యాంకు సాధించాడు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలేసి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. ప్రభుత్వ పాఠశాలలో తెలుగు మీడియం చదివిన జయకృష్ణ ఉన్నత స్థాయి ఉద్యోగం సాధించడంపై అతని తల్లిదండ్రులు, స్నేహితులు హర్షం వ్యక్తంచేశారు.

సన్మానం



అంజద్‌ను సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

తాండూరులోని గుమాస్తానగర్‌లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద అమ్మవారి వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి.గురువారం పట్టణానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ అంజద్ భక్తులకు అన్నదానం చేశారు. కులమతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవాలన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అంజద్‌ను ఘనంగా సన్మానించారు. – తాండూరు టౌన్

హంస వాహనంపై శ్రీవారి ఊరేగింపు



హంస వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

- ఘనంగా స్వామి వారి కల్యాణం
- అలరించిన నృత్యాలు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీ వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం రాత్రి స్వామి వారిని హంస వాహనంపై ఆలయ మఢ వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు వాహనం ముందు పలు భక్తి పాటలు పాడుతూ గోవిందుడిని స్మరించుకున్నారు. ఉదయం నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 11 గంటలకు స్వామి వారి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ పాల్గొని స్వామి వారిని దర్శించుకుని సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. అనంతరం జ్ఞాపికలు అందించి ఘనంగా సత్కరించారు.

యువతి అదృశ్యం



మమత (ఫైల్)

పహాడీషరీఫ్: యువతి అ దృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ఎల్.వెంకటేశ్వర్లు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. రంగనాయకుల కాలనీకి చెందిన దిగుల్ల వెల్లస్వామి కుమార్తె దిగుల్ల మమత(22) స్థానికంగా ఉన్న ఆవిష్కరణ్ కంపెనీలో హౌస్ కీపింగ్ చేస్తుంది. రోజు మాదిరిగానే ఈ నెల 23న ఉదయం డ్యూటీకి వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. ఈ విషయమై కంపెనీలో అడగగా డ్యూటీ ముగిశాక రాత్రి 7 గంటలకు బయటకి వెళ్లిపోయిందని యాజమాన్యం సమాధానం ఇచ్చింది. ఆమె ఆచూకీ కోసం సాధ్యమైన అన్ని ప్రాంతాలలో వెతికినా ప్రయోజనం లేకపోవడంతో, వెల్లస్వామి 24వ తేదీన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆమె ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో గాని సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.

తల్లి మందలించిందని.. కూతురి ఆత్మహత్య

ఇబ్రహీంపట్నం రూరల్: కుటుంబ కలహాలతో ఓ యువతి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ నోయల్‌రాజ్ కథనం ప్రకారం.. తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలో నివాసం ఉండే శ్యామల ప్రగతి(19) బీఎన్‌రెడ్డినగర్‌లోని ఓ ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతుంది. వ్యక్తిగత సమస్యలతో నాలుగు నెలలుగా కళాశాల మానేసింది. రెండు రోజులుగా ఇంట్లో తల్లితో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం ఉదయం నుంచి ఇంట్లోనే ఉండి గదికి తలుపులు వేసుకుంది. సాయంత్రం తల్లి కిటికీలోంచి చూసే సరికి ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ప్రగతి వేలాడుతూ కనిపించింది. గట్టు చప్పుడు కాకుండా కుటుంబ సభ్యులు మృతదేహాన్ని తరలించే యత్నం చేయగా.. కాలనీవాసులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో స్వాధీనం చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. కేసు నమో దు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల పరిశీలన



ఏఐ విద్యను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ శ్రీహర్ష

కొడంగల్ రూరల్: మండలంలోని చిన్ననందిగామ, అయిన్‌పల్లి, బూల్కాపూర్, చిట్లపల్లితండా, హుస్సేన్‌పూర్ గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను గురువారం ట్రైనీ కలెక్టర్ శ్రీహర్ష ఆకస్మికంగా సందర్శించారు. ఆయా పాఠశాలల్లో అమలు చేస్తున్న కంప్యూటర్ ఆధారిత కృత్రిమ మేధ(ఏఐ) విద్యపై విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు చాక్లెట్స్ పంపిణీ చేశారు. చదువుపై ఆసక్తి పెంచుకుంటూ ఉన్నత స్థానాలకు చేరుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ రాంరెడ్డి, ఏఎంఓ శ్రీరాంమస్తా, హెచ్‌ఎంలు భారతి, మౌనిక, జయభారతి, సాయికిరణ్, క్రాంతికుమార్ పాల్గొన్నారు.

యువరైతు దుర్మరణం

- విద్యుత్ కంచెకు తగలడంతో షాక్
- రాళ్లచిట్టెంపల్లిలో ఘటన

అనంతగిరి: పంట పొలాన్ని అడవి పందుల బారి నుంచి కాపాడుకునేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్ రక్షణ కంచెను తాకి ఓ యువ రైతు మృతిచెందాడు. ఈ సంఘటన వికారాబాద్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ భీంకుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని రాళ్లచిట్టంపల్లికి చెందిన రమేశ్(25) వ్యవసాయంతో పాటు మేకలు పోషిస్తూ జీవనం సాగించేవాడు. ఎప్పటిలాగే బుధవారం మేకలు మేపేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో సంగయ్య అనే రైతు పొలానికి ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెను తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. చీకటి పడినా రమేశ్ ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. గురువారం ఉదయాన్నే ఓ వ్యక్తి ఫోన్ చేసి విద్యుత్ షాక్‌తో మృతిచెందాడని చెప్పడంతో బోరున విలపిస్తూ ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అర్ధరాత్రి అక్రమంగా ఇసుక రవాణా

ఇందర్‌చెడ్‌లో ట్రాక్టర్‌ను పట్టుకున్న టాస్క్‌ఫోర్స్



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

బషీరాబాద్: ఇసుక అక్రమ రవాణా బషీరాబాద్‌లో జోరుగా సాగుతుంది. అర్ధరాత్రి కాగ్నాతో పాటు వాగులు, వంకల నుంచి అక్రమార్కులు ఇసుక రవాణా చేస్తూ సర్కారు ఆదాయానికి గండి కొడుతున్నారు. బుధవారం అర్ధరాత్రి ఇందర్‌చెడ్ దగ్గర కాగ్నానది నుంచి ఇసుక తరలిస్తున్నట్ల సమాచారం అందడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. అల్లాపూర్‌కు చెందిన ట్రాక్టర్‌ను పట్టుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ నుమాన్ అలీ ట్రాక్టర్ ఓనర్ సురేష్‌పై కేసు నమోదు చేసి సీజ్ చేసినట్లు చెప్పారు.

రాత్రిపూట బారులు

మండలంలో ఇందిరమ్మ ఇళ్లకు ఉచిత ఇసుక ఇస్తున్నా.. రాత్రివేళల్లో అక్రమంగా ఇసుక రవాణా కొనసాగుతూనే ఉంది. ముఖ్యంగా మైల్వార్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లకు, ప్రైవేటు నిర్మాణాలకు రాత్రి వేళ అక్రమంగా ఇసుక వేస్తున్నారు. చీకటిపడితే చాలు ట్రాక్టర్లు కొత్లాపూర్ దగ్గర నదిలోకి బారులు తీరుతున్నాయి. ఇదంతా పోలీసుల అండతోనే కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

పేరు మార్పుపై మాజీ ఎమ్మెల్యే విమర్శలు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

బంట్వారం: బీఆర్ఎస్ పాలనలో బతుకమ్మ చీరల పేరిట పంపిణీ చేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ చీరలుగా పేరు మార్చడం విడ్డూరంగా ఉందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ విమర్శించారు. బీఆర్ఎస్ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు సుందరి అనిల్ ఆధ్వర్యంలో గురువారం కరీంపూర్ సమీపంలోని ఫంక్షన్ హాల్లో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మాజీ మండల అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, మాజీ ప్రజాప్రనిధులు, నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

యువతి కిడ్నాప్ కేసులో ముగ్గురి అరెస్ట్

కీసర: నవ వధువును బలవంతంగా తీసుకెళ్లిన కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రేమ వివాహం చేసుకుందన్న కారణంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సంపల్లిలో శ్వేత అనే యువతిని ఆమె తల్లిదండ్రులు బుధవారం బలవంతంగా లాక్కెళ్లారు. దీంతో శ్వేత భర్త ప్రవీణ్ అతడి కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం కీసర పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ ఆంజనేయులు మాట్లాడుతూ శ్వేత కిడ్నాప్ కేసులో ఇప్పటికే ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. శ్వేత ఆచూకీ కోసం రెండు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఎస్.ఐ శ్రీనివాస్‌రెడ్డితో శ్వేత తండ్రి ఫోన్‌లో మాట్లాడించారు. ప్రస్తుతం ఆమె తల్లిదండ్రుల వద్ద క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. త్వరలోనే ఆమెను కీసర పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి భర్తకు అప్పగించనున్నట్లు తెలిపారు.